ISSN 2583-9020

An Electronic Veda Journal

# वेद वाणी

(vEda vaaNee)

Volume 2, Issue 2, July 2024



Printed and Published by

**Veda Samskruti Samiti**

Malkajgiri

Hyderabad TS

# ఏకాదశ ద్వార పురవాసి - బ్రహ్మము విశ్వరూపి

[Ekaadasha Dwaarapuravaasi – Brahmamu Vishvaroopi]

**సోమంచి (తంగిరాల) విశాలాక్షి**

**వైస్ ప్రెసిడెంట్, వేద సంస్కృతి సమితి, హైదరాబాద్**

**Abstract**

This paper explains the *shareeram* (body) as a castle with its eleven doors verses the *Aatman/ Brahman*, which is *nirgunam* (cannot be described) and *sarva vyaapakam* (omni present). According to scriptures, our body has nine doors plus naval and brahma *randhram* (passage), total of eleven doors or openings. How Katha, Kena and other Upanishads have elaborated on this concept is explained in this article. Views of Sri Adi Shankara Bhagavatpaada are also reported in this paper. He has stated that *aatmaa* leaving this *shareera* is no surprise, since the body is always open with its nine doors. It would be a surprise only if *the* soul does not leave the body using any one of these many doors! Then author takes Veda *sandhyaavandana* mantra "*Hagumsashshuchishat....bruhat*" and explains further the *Parabrahma Swaroopam*, how it is linked to each *Shabda* in this mantra. The essay concludes with well-known *mahaavaakyaas: Aham BrahmaAsmi*, and *Sarvam khalvidam Brahma.*

**ఓం సదాశివ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం!**

**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్!!**

**ఓం సహనావతు! సహ నౌ భునక్తు! సహ వీర్యం కరవావహై!**

**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై!!**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!!**

ఉపనిషత్తులు ఆత్మజ్ఞానమును బోధిస్తాయి. జీవాత్మ గురించి, పరమాత్మ గురించి, ప్రకృతిని గురించి వివేచన చేశాయి. పరబ్రహ్మము యొక్క స్వరూప లక్షణాలను, తటస్థ లక్షణాలను అనేక విధాలుగా వివరించాయి. "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" (తైత్తిరీయ ఉపనిషత్తు 2-1-1) అని చెప్పాయి.

"యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవంతి,త్ ప్రయన్త్యభిసంవిశన్తి । తద్విజిజ్ఞాసస్వ । తద్బ్రహ్మేతి" । (తైత్తిరీయ ఉపనిషత్తు 3-1-1) అంటూ బ్రహ్మమును నిర్వచించాయి.

"అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్, తథారసం నిత్యమగంధవచ్చ యత్! అనాద్యనంతం మహతః పరం ధృవం, నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే"!! (కఠోపనిషత్తు - 1.3.15).

ఆత్మ, శబ్దము, స్పర్శ, రూపము లేనిది. పెరుగుదల లేనిది, రసము లేనిది, కాలాతీతమైనది. గంధము లేనిది, కారణము లేనిది, అంతము లేనిది, మహత్తత్త్వము కంటే అతీతమైనది, చలనము లేనిది. ఇటువంటి బ్రహ్మమును

సాక్షాత్కరించుకొనినచో మృత్యువు నుండి విడుదల లభించును.

"న జాయతే మ్రియతే వా విపశ్చిత్
నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్ !
అజో నిత్యశ్శాశ్వతోऽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే"!!
(కఠోపనిషత్తు - 1.2.18).

మేధావి అయిన, ప్రజ్ఞాస్వరూపమైన ఆత్మ పుట్టుట లేదు, మరణించుటలేదు. ఇది ఇతర మరు కారణముల నుండి పుట్టేది కాదు. ఆత్మ నుండి ఇతరము ఏది కూడా పుట్టదు. ఈ ఆత్మ పుట్టుక లేనిది, నిత్యము, శాశ్వతము. ఇదియే సనాతనము. ఇదియే నిత్య నూతనము. దేహము సంహరింపబడినా, దేహములోనున్న ఈ ఆత్మ సంహరింపబడదు.

"యచ్చక్షుషా న పశ్యతి, యేన చక్షూంషి పశ్యతి,
తదేవ బ్రహ్మ త్వం విద్ధి, నేదం యదిదముపాసతే"!!
(కేనోపనిషత్తు - 1- 6.)

దేనిని కన్నులు చూడలేవో, దేని వలన కన్నులకు దర్శన శక్తి కలుగుతున్నదో అదియే బ్రహ్మము, అంటూ ఇదే విధంగా అన్ని ఇంద్రియముల గురించి చెప్పారు కేనోపనిషత్తులో!

బృహదారణ్యకోపనిషత్తులో, "నేతి నేతి" న ఇతి - ఇది కాదు ఇది కాదు అంటూ సర్వవస్తు జాతాన్ని కొట్టివేస్తే, ఏది మిగులుతున్నదో అది బ్రహ్మము అంటూ చెప్పారు. అంటే బ్రహ్మము వస్తువు కాదు, ఇంద్రియాలతో గ్రహింపబడేది కాదు. "విజ్ఞాతారమరే కేన విజానీయాత్" అన్నారు శ్రీ యాజ్ఞవల్క్య మహర్షి బృహదారణ్యకోపనిషత్తులో! బ్రహ్మము సబ్జెక్టు. ఇది ఆబ్జెక్ట్ కాదు. గ్రహింపబడే వస్తువు కాదు, గ్రహించేదే బ్రహ్మము. బ్రహ్మము దుర్విజ్ఞేయము కనుక, ఈ విధముగా బ్రహ్మమును గురించి అనేక విధములుగా చెప్పారు ఉపనిషత్తులలో!!

బ్రహ్మము అత్యంత సూక్ష్మమైనది కనుక ఉపనిషత్తు బ్రహ్మమును ఎన్నో విధములుగా వివరించింది. లౌకికమైన విషయాలను గ్రహించటం వేరే! బ్రహ్మమును తెలుసుకోవాలి అంటే అన్వేషించాలి, శ్రవణ మనన నిదిధ్యాసనలతో గ్రహించాలి.

ముముక్షువులకు అత్యంత ఆనందాన్నిచ్చే బ్రహ్మజ్ఞాన బోధకాలైన ఉపనిషత్తులలో - దశోపనిషత్తులలో ముఖ్యమైనది, ఆసక్తికరమైనది కఠోపనిషత్తు. ఇందులోని ఆసక్తికరమైన కథ, బ్రహ్మ జ్ఞానబోధ అలరిస్తాయి.

కఠోపనిషత్తులోని ఐదవ వల్లిలోని ప్రథమ, ద్వితీయ మంత్రముల సారమును గురించి ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాము. ఈ మంత్రములు అత్యంత మహత్తర జ్ఞానబోధకములు, సర్వ వేద సారభూతములు, సర్వ మంత్రముల సారభూతములు, పరబ్రహ్మ లక్షణములను తెలియజేసే మంత్ర శ్లోకములు. అంతటా ఉన్నది ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది, లేకపోవటం అన్నది ఉండదు. నిజానికి నచికేతుడు తెలుసుకోగోరిన ముఖ్యమైన మూడవ ప్రశ్నకు -

జీవుడు మరణించాక ఉంటాడా? ఉండడా? ఏమవుతాడు ? అనే ప్రశ్నకు ఈ మంత్రములలో సమాధానం లభించింది అనుకోవచ్చును. ఆత్మ అనేది ఒక వస్తువు కాదు. అది ఎక్కడికి పోదు. కేవలం స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మాత్రమే వెళ్ళిపోతాయి, కానీ వాటిని ఉపాధిగా చేసుకున్న ఆత్మ నిత్యము, శాశ్వతము. పరమాత్మ సృష్టి రూపంలో వ్యక్తమయ్యాడు - "విశ్వం విష్ణుః" అన్నప్పుడు, పరమాత్మ కానిది ఏదీ లేదు. పరమాత్మ సర్వవ్యాపి అని గ్రహించటమే ముఖ్య లక్ష్యము.

కఠోపనిషత్తులోని ఐదవ వల్లిలోని ప్రథమ, ద్వితీయ మంత్రములలో బ్రహ్మమును గురించి మరొక పద్ధతిలో వివరించారు. సత్ గా సర్వత్రా ఉన్నదని గ్రహించిన బ్రహ్మమును, చిత్ గా ఉపాధులలో ఉన్నది అని గ్రహించాలి. మనమే బ్రహ్మము. మన చుట్టు ప్రక్కల ఉన్న ప్రాణులలో ఉన్నదే బ్రహ్మము అని, బ్రహ్మము సాక్షి చైతన్యమని, అది మనలోనే ఉన్నది అని ప్రథమ మంత్రము వివరిస్తోంది. రెండవ మంత్రములో అనుష్ఠానముతో - అనగా నిధిధ్యాసనతో బ్రహ్మమును తెలుసుకోవాలి అని బోధించారు. 'తత్' అనేది 'త్వం' లోనే ఉంటుంది. మొదటి శ్లోకంలో త్వం పద విచారణ చేశారు. రెండవ శ్లోకంలో తత్ పద అర్థ విచారణ చేశారు. "ఏతద్వై తత్." 'ఏతత్' అంటూ 'త్వం' పదముతో చెప్పబడినదే 'తత్' పద వాచ్యము.

జీవచైతన్యమే విశ్వ చైతన్యము. అదే బ్రహ్మము, పరమాత్మ చైతన్యము అని కఠోపనిషత్తులోని పంచమవల్లిలో ఈ రెండు మంత్రములలో బోధించారు.

నా శరీరము అనే పురములో నెలకొన్న బ్రహ్మము సర్వ శరీరములలోనూ నెలకొని ఉన్నాడు అని బోధిస్తోంది రెండవ మంత్రము. ఈ రెండు మంత్రములు కలిసి యావద్విశ్వము బ్రహ్మమే అని బోధించాయి.

"ఏతద్వై తత్" - ఇక్కడ చెప్పబడిన 'త్వం' అక్కడ చెప్పబడిన 'తత్' ఒక్కటే ! "తత్వమసి" అని బోధించింది ఈ మంత్రము. బ్రహ్మము అంటే సాక్షి చైతన్యము, వస్తువు కాదు అంటూ ఉపనిషత్తు అనేకమార్లు అనేక పద్ధతులలో చెప్తోంది.

కఠోపనిషత్తులోని పంచమవల్లిలోని ఈ రెండు మంత్రములను, వాటి అర్థ వివరణను చూద్దాము.

"పురమేకాదశద్వార మజస్యావక్రచేతసః! అనుష్ఠాయ న శోచతి, విముక్తశ్చ విముచ్యతే!! ఏతద్వై తత్"!!

పుట్టుక లేనిదియు, కుటిలము కాని చైతన్య ప్రకాశముగల బ్రహ్మాత్మ యొక్క నగరము 11 ద్వారములు కలది. ఆ బ్రహ్మాత్మను అనుసంధానము చేసినచో నెవ్వరు శోకించరు, మరియు ముక్తుడై ఉన్నవాడే ముక్తుడవుతాడు. ఈ ఆత్మయే నిశ్చయముగా ఆ బ్రహ్మము. మన ఈ శరీరములో ఉన్నవాడే సకల పురవర్తి. ఇది బ్రహ్మ పురము. మన శరీరమే బ్రహ్మ పురము.

సాధారణంగా మనం నేర్చుకునే విద్యలో బాహ్యయ వస్తువును వస్తువుగా చూడటం నేర్చుకున్నాము. నేను వేరు,

వస్తువు వేరు. ఏదైనా దివ్య క్షేత్రం గురించి వింటే, అక్కడికి వెళతాము. నేను వేరే, ఆ క్షేత్రం వేరే! అక్కడికి వెళ్ళినప్పుడు చూసి, దర్శించి ఆనందిస్తాము. కానీ అదేవిధంగా బ్రహ్మమును గురించి ఉపనిషత్తులలో చదివి, గురువు బోధించగా విని, అనగా శ్రవణం చేసి తెలుసుకోలేము. ఇవి సాధకునికి మార్గం మాత్రమే! బ్రహ్మమును గురించి తెలియాలి అంటే బాహ్యంలో వెతకటం మానేసి "ఆ బ్రహ్మము నేనే" అని అర్థం చేసుకుని అనుభవించాలి.

బ్రహ్మము "సత్" రూపంలో అంతటా ఉన్నది. "చిత్" రూపంలో - చైతన్య రూపంలో కేవలం ప్రాణం ఉన్న జీవులలోనే ఉన్నది. మనలోనే ఉన్నది. మొదటి మంత్రంలోని మొదటి పాదం అంటే మొదటి వాక్యంలో బ్రహ్మము సాక్షి చైతన్య రూపంలో మన శరీరంలో ఉన్నదని ఉపనిషత్తు బోధించింది. రెండవ వాక్యంలో అనుష్ఠానం ద్వారా - నిదిధ్యాసన ద్వారా బ్రహ్మమును పొందాలి అని వివరించింది. అనుష్ఠానం అంటే శ్రవణ మనన నిధిధ్యాసనలు. ఈ సాధన చేసి "అహం బ్రహ్మస్మి" జ్ఞానాన్ని పొంది స్థిరపరుచుకోవాలి.

పుట్టుక లేనిదియు, కుటిలము కాని, చైతన్య ప్రకాశము కల బ్రహ్మాత్మ యొక్క నగరము 11 ద్వారములు కలది. ఆ బ్రహ్మను అనుసంధానము చేసిన సాధకుడు శోకించడు. నిత్యముక్తుడైన అతడు ఈ సాధన ద్వారా ముక్తుడు అవుతాడు. "ఓ నచికేతా! నీవు అడిగిన ఆ బ్రహ్మము నిశ్చయముగా ఈ ఆత్మయే" అని యమధర్మరాజు నచికేతునికి బోధించాడు.

పదకొండు (11) ద్వారములు గల పురములో 'అవక్ర చేతసః' అయిన రాజు ఉన్నాడు. "అవక్ర చేతసః" అనగా కుటిలము లేని చేతస్సు అనగా ఎరుక - జ్ఞానము. సూర్యప్రకాశము వలె నిత్యముగా ఒకే రూపము కలదైన జ్ఞానము - ఆ జ్ఞానమే పురపతి. ఆ రాజు 'అవక్ర చేతసః' - చావు పుట్టుకలు లేనివాడు, జీవులకు ఉండే షడ్భావ వికారాలు - అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి - అనునవి లేనివాడు. బుద్ధికి, మనసుకు కుటిలత లేకపోతేనే "అవక్ర చేతసుడు" అర్థమవుతాడు. సూర్య కాంతికి వక్రత లేదు. మన బుద్ధి సూర్య కాంతిలా ఉండాలి.

మనలోని చైతన్యమే రాజు. అతను మనలోని ఆత్మ. శరీరానికి మార్పు ఉంది, ఆత్మకు లేదు. అతను ఆ పురానికి రాజు, కానీ అతడు ఆ పురము కాదు. రాజు పురమునకు ఒక భాగం కాదు. పురమునకు అధిపతి. ఆ పురానికి ఏమైనా, అతనికి ఏమీ అవదు. ఆ పురము మానవ దేహమే! మన దేహమే! అందులో ఉన్న రాజు నేనే! "నేను అని వ్యవహరించే చైతన్యమే, ఈ జీవుడే, ఆ దేవుడు, పరబ్రహ్మము", అని ఈ మంత్రం వివరిస్తోంది. అతడు కేవల సాక్షి. అతడే భోక్త. అతడు నీవే! "ఏతద్వైతత్"!!

నగరము - పురము, అంటే నిజంగా నగరం కాదు. "పురమివ పురమ్" నగరము వంటిది, అని ఒక దృష్టాంతంతో చెబుతున్నారు. ఆ నగరానికి ప్రభువు రాజు, ఆత్మ. నేను అనే సాక్షి చైతన్యం. ఆ నగర ద్వారపాలకులు ఇంద్రియములు. ఆ నగరంలోని ప్రజలు, ఇంద్రియముల

యొక్క అధిష్ఠాన దేవతలు. ఆ నగరమునకు ఉన్న 11 ద్వారములు ఏవి అంటే, తలపైన - మాడు పైన ఉన్న బ్రహ్మరంధ్రము, ముఖములో కల సప్త ద్వారములు - రెండు కళ్ళు, రెండు ముక్కుపుటములు, ఒక నోరు, రెండు కర్ణ రంధ్రములు. నాభి రంధ్రము 9వది. ఇంక నాభి క్రింద ఉన్న రెండు ద్వారములు - వ్యర్థములను విసర్జించేవి. మొత్తం 11 ద్వారములు. భగవద్గీతలో (5 - 13) శ్రీకృష్ణ పరమాత్మ బ్రహ్మరంధ్రాన్ని, నాభి ద్వారాన్ని వదిలేసి, నవ ద్వారములను పేర్కొన్నారు. ఎందుకంటే ఈ తొమ్మిది ద్వారములు ఎప్పుడు తెరిచే ఉంటాయి. జీవుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడు నాభి రంధ్రంతోనే పూర్తి అనుబంధం ఉంటుంది. బయటకొచ్చాక ఆ బంధనాళాన్ని త్రుంచేస్తారు. పుట్టడానికి ముందు మన దేహంలోకి, పరమాత్మ - పరబ్రహ్మము బ్రహ్మరంధ్రము ద్వారా ప్రవేశిస్తాడు. యోగ సాధనతో జీవుడు శరీరాన్ని వదిలేసేటప్పుడు బ్రహ్మరంధ్రం తెరుచుకుంటుంది. కనుక ఈ రెండు రంధ్రాలు నిత్యం ఉపయోగించేవి కావు. ఆది శంకర భగవత్పాదులు కూడా -

"ఉద్ఘాటిత నవ ద్వార పంజరే విహగోనిలః!
యత్తిష్ఠతి, తదాశ్చర్యం, ప్రయాతే విస్మయః కుతః"? అన్నారు.

తొమ్మిది ద్వారాలు తెరిచి ఉంచిన పంజరంలో ఉన్న ప్రాణము అనే చిలుక అందులో ఉంటే ఆశ్చర్యపడాలి కానీ, ఎగిరిపోతే వింత ఏముంది?

ఈ ఒకటవ మంత్రంలోని దృష్టాంతంలో జీవాత్మ స్వరూపము, వ్యక్తి స్వరూపము వివరించబడింది. మానవుని దేహమే నగరము. ఆత్మయే రాజు. హృదయమే రాజధాని. శరీరంలోని అంగాలు, ఇంద్రియాలు, ద్వారపాలకులు. శరీరంలోని వివిధ భాగాలలో ఉన్న దేవతలు, ఇంద్రియాల అధిష్ఠాన దేవతలు పురజనులు. పెద్ద రక్తనాళాలు రహదారులు. చిన్న రక్తనాళాలు సందులు. చర్మము ఆ పురము యొక్క సరిహద్దు. జ్ఞానేంద్రియాలు లోపలికి వచ్చే ద్వారాలు. కర్మేంద్రియాలు బయటికి వెళ్ళే ద్వారాలు. నోరు రెండింటికి ద్వారము. ఇటువంటి పురానికి రాజు మనలోని ఆత్మ. అనుష్ఠాయ అని చెప్పారు. రెండవ పాదములో - ఈ శరీరము నేను కాదు, నేను ఈ శరీర పురంలోని రాజును, పురస్వామిని, అని గ్రహించాలి. దేహం నేను కాదు, నేను దేహిని. దేహం నశించిపోతుంది, దేహి - ఆత్మ నశించదు. దేహాన్ని, దేహిని విడదీసి చూడటం, అనుభవించటం అభ్యాసం చేయాలి. ఈ జ్ఞానం, ఈ అనుభవం కలగటానికి అనుష్ఠానం చేయమన్నారు. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి.

వెలుగు ఎప్పుడూ ఉంటుంది. వెలుగులో మన చేతిని చూస్తాము. వెలుగు వల్ల చేతిని చూడగలిగాము అని గ్రహించము. చేతిని ప్రకాశింప చేస్తున్న కాంతిని గమనించము. మన చేతిని చాపమని, ఏం చూస్తున్నావు ? అంటే, చేతిని చూస్తున్నాను, అంటాము. కాంతిని చూస్తున్నాను అనము. రెండింటిని గమనించాలి. చేతిని, కాంతిని విడదీసి చూడగలగాలి. కాంతి వల్ల చేతిని చూస్తున్నామని తెలుసుకోవాలి. చెయ్యి ఉన్నా,

లేకపోయినా, కాంతి ఉంటుంది. ఇటువంటి జ్ఞానం వల్ల ఆత్మను తెలుసుకుంటాము. చైతన్యమే నేను అనే ఎరుక కలుగుతుంది. అదే జీవన్ముక్తి. ఇక్కడే, ఇప్పుడే, ఈ దేహంలో ఉంటూనే, ముక్తులమవాలి. జీవన్ముక్తులమవాలి. దేహం వదిలాక, విదేహ ముక్తి కలుగుతుంది. పునర్జన్మ ఉండదు. "విముక్తశ్చ విముచ్యతే". ముక్తుడై ఉన్నవాడు ముక్తి పొందుతాడు, పునర్జన్మ ఉండదు.

పరమేశ్వరుని గురించి అనుష్ఠానము చేయటము వలన సర్వప్రాణికోటిలో ఉన్నది ఒకే చైతన్యము, ఒకే పరమాత్మ - పరబ్రహ్మము, చిచ్ఛక్తి, అనే ఎరుకను పొందిన జీవుడు శోకించడు. అభయము పొందుతాడు. అతని సర్వకామనలు తీరుతాయి. కర్మబంధ విముక్తుడు అవుతాడు.

ఈ ఐదవ వల్లి ప్రథమ మంత్రము మానవ శరీరాన్ని 11 ద్వారాలు కలిగిన పురంగా వర్ణించింది. 11 ద్వారాలు కలిగిన మానవ శరీరమే పురము. దానికి రాజు ఆ శరీరంలో ఉన్న ఆత్మయే ! అదియే పరమాత్మ, పరబ్రహ్మము. ఆయన తేజోవంతుడు, స్వతంత్రుడు, పరిపూర్ణుడు, పరిశుద్ధుడు. ఆయన అందులో ఉండాలనుకున్నంత కాలం ఉంటాడు, నిష్క్రమించాలనుకున్నప్పుడు నిష్క్రమిస్తాడు. ఏ విధంగా అయితే ఒక ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయినా, యజమాని కాలకుండా సుఖంగానే ఉంటాడో, అలాగే శరీరం శిథిలమై ఆత్మ నిష్క్రమించినా, ఆత్మ చక్కగా ఉంటుంది. ఎందుకంటే పురుషుడు లేక ఆత్మ జనన మరణాలకు అతీతుడు, జ్ఞాన స్వరూపుడు. ఆత్మ అనేది ఇంద్రియాలకు, స్థూల, సూక్ష్మ కారణ శరీరాలకు, మనోబుధ్యహంకారాలకు వేరేగా ఉంటుంది. అటువంటి బ్రహ్మమును ఆరాధించినవాడు అజ్ఞాన బంధనము నుండి విముక్తుడై స్వేచ్ఛను పొందుతాడు. ఈవిధంగా "శరీరమనే బ్రహ్మ పురము" అనే రూపకముతో వర్ణించారు. "ఏతద్వై తత్" అని గ్రహించటమే ముక్తి.

నా శరీరములో దేవుడున్నాడు - అంటే అది ద్వైతం. నా శరీరములో ఉన్న దైవము నేనే!, అంటే అద్వైతం.

వివిధ భాగాలను తెచ్చి, ఏకత్ర పరిచి, కారును చేర్చుతారు. కారును కారు కోసం తయారు చెయ్యరు. యజమాని కోసం చేస్తారు. అతను దానికి అధిపతి. అలాగే ఇంద్రియాలు, శరీరం ఉపకరణాలు. అధిపతి 'అజః'. అతడు స్వతంత్రుడు. వాటికి భిన్నంగా ఉంటాడు. "శాఖా చంద్ర న్యాయము"గా ఈ పురమును, పురపతిని- కూటస్థుడైన ఆత్మను చెప్పటానికి చెప్పారు. ఆ కొమ్మల మధ్యలోంచి చూడు, చంద్రుడు కనిపిస్తాడు, అంటే, ఇక్కడ చూడవలసినది కొమ్మలను కాదు, చంద్రుని. అలాగే, పరమాత్మను, కూటస్థ ఆత్మను చెప్పటానికి ఏకాదశ ద్వార పురమును గురించి చెప్పారు.

రంగు రాళ్ళను, వజ్రాలను పరీక్షించి, అసలు వజ్రాన్ని పట్టుకునే "రత్న పరీక్ష న్యాయం"లాగా, పంచకోశ విచారంతో ఆత్మను తెలుసుకోవాలి.

మరి ఆ ఆత్మచైతన్యము - ఆ పరమేశ్వరుడు మన దేహంలోనే ఉన్నాడా? అంటే, సర్వప్రాణుల

హృదయాలలోనూ ఉన్నాడు, విశ్వమంతటా ఉన్నాడు అని చెప్తూ, ఎక్కడెక్కడ ఏయే రూపాలలో ఉన్నాడో రెండవ మంత్రంలో వివరించారు.

ఆత్మ దేహానికి ప్రభువు అన్నంత మాత్రాన సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, సచ్చిదానంద స్వరూపుడైన ఆత్మ, జీవుని ఉపాధికి పరిమితమయ్యాడని అపోహ పడరాదు అంటూ ఈ రెండవ మంత్రంలో ఆత్మ యొక్క అపరిమితత్వాన్ని, అనంతత్వాన్ని, సర్వశక్తి మత్వాన్ని, నిరంజనత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని "విశ్వం విష్ణుః" అన్న తత్వాన్ని వివరిస్తున్నారు. పరబ్రహ్మమును స్తోత్రిస్తున్నారు. శ్రీ ఆది శంకర భగవత్పాదులు ఆత్మను "సర్వ పురవర్తీ" అన్నారు.

"హగ్ం సః శుచిషద్ వసురన్తరిక్షసద్
హోతా వేదిషదతిథిర్దురోణ షత్!
నృషద్ వరసద్ ఋత సద్ వ్యోమసత్
అబ్జా గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్"!!

జగద్గురువులు శ్రీ ఆది శంకర భగవత్పాదలు ఉపనిషద్భాష్యంలో ఆధ్యాత్మికపరంగా మంత్ర శ్లోకాలను వివరించారు. సాధారణంగా ఆధ్యాత్మికపరంగా, ఆధిదైవిక పరంగా, అధియజ్ఞ పరంగా సందర్భానికి తగినట్లుగా అర్థాలను చెప్పుకోవచ్చును. ప్రస్తుత మంత్రము ఈ కఠోపనిషత్తులోను, ఋగ్వేదములోను, కృష్ణ యజుర్వేదములోను, సంహితలో, బ్రాహ్మణములో, సంధ్యావందన ప్రార్థనలోనూ కూడా ఉన్నది అంటే ఈ మంత్రార్థము యొక్క ప్రాముఖ్యత ఎంత గొప్పదో, దానిని తెలుసుకోవటం ఎంత అవసరమో అర్థమవుతున్నది. స్థూలంగా ఈ మంత్రార్థము ఇలా ఉంది -

ఆత్మయే - పరమాత్మయే ద్యులోకంలో - ఆకాశంలో దేదీప్యమానంగా ప్రకాశించే సూర్యునిలా, భూమి ఆకాశాల మధ్యలో - అంతరిక్షంలో సంచరించే వాయువులా, భూలోకంలో అగ్నిహోత్రునిలా, యజ్ఞ కుండములో ప్రజ్జ్వరిల్లే అగ్నిలా, యజ్ఞ సామగ్రిలా, సోమరస పాత్రలో సోమరసములా, గృహముల కరుదించే అతిథిలా అనేక రూపాలను ధరిస్తాడు. మానవులలో, దేవతలలో, దానవులలో, శంఖ, శుక్తి, మకరాది జలచర రూపాలలో, పర్వతాల రూపంలో, పర్వతాల మీద కల వృక్షాది జంతువులు మొదలైన వాటి రూపంలో, పర్వతాల నుంచి జాలువారే ఝురుల వలె, నదుల వలె కనిపించేది ఆయనే! భూమి నుండి మొలకెత్తే మొక్కల, వృక్షముల రూపంలో, ఫలపుష్పముల రూపంలో ఉన్నది పరమాత్మే! వీటిలో దేనిని పట్టుకున్నా, పరమాత్మను గ్రహించినట్లే! పరమాత్మ సూర్యునిగా, వాయువుగా, అగ్ని మొదలైన వాటిగా ప్రకటిత మవుతున్నాడు కనుక ఇక్కడ అంగ అంగీ భావాన్ని గ్రహించాలి. వీరందరూ పరమాత్మను తెలుసుకోవటానికి ద్వారముల వంటి వారు.

ఇప్పుడు ప్రతి పదము యొక్క అర్థాలను తెలుసుకుంటూ, ఆధ్యాత్మిక పరంగా, ఆధిదైవిక పరంగా వాటి అర్థాలను గ్రహిద్దాము.

హోగ్ం సః అంటే హంసః అని అర్థం. గ్ం అనేది యజుర్వేద ప్రయోగము. గ్ం అనే ప్రయోగము చాలాచోట్ల వస్తూ ఉంటుంది. "గణానాం త్వా గణపతి గ్ం హవామహే..." అని స్తోత్రిస్తాము. ఋగ్వేదంలో హంసః శుచిషత్ అని చెప్తారు.

1. హంసః శుచిషద్ - హంసః అంటే సూర్యుడు, జ్ఞాని, శివుడు, బ్రాహ్మణుడు, హంస అని పిలువబడే ఒక పక్షి, ఇలా అనేక అర్థాలున్నాయి. మన ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలను గమనిస్తూ జపించటాన్ని 'హంస జపం' లేక 'అజపాజపము' అంటాము. శుచి అంటే శుద్ధమైనది, ప్రకాశ వంతమైనది. కనుక ద్యులోకం అని అర్థం. అదే సువర్లోకము లేక స్వర్లోకము, స్వర్గము అని చెప్పబడింది. 'హంసః శుచిషత్' పరమాత్మ సూర్యుని రూపంలో ప్రకాశవంతమైన శుద్ధ లోకంలో అనగా స్వర్లోకంలో ఉన్నాడు. "హంసాయ తస్మై శుచి సద్మనే నమః" అని బ్రాహ్మణంలో ఉన్నది. "అసావాదిత్యో బ్రహ్మ" అని ఉపనిషత్తు చెప్తోంది. పరమాత్మ సత్ - అనగా ఉన్నది, ఉన్నాడు. పరమాత్మ ద్యులోకంలో సూర్య భగవానునిగా ఉన్నాడని భావించటము అధిదైవికంగా చెప్పటము. అంటే సూర్యుడు పరమాత్మ అని భావించి చెప్పటము అధిదైవంగా సూర్యుడిని సూర్య భగవానునిగా చెప్పటము. "శుచౌ దివి ఆదిత్యాత్మనా సీదతి". సూర్యుడు అన్నది ఉపలక్షణంగా చెప్పారు. ఆదిత్యాత్మనా - ఆదిత్యని రూపంలో - అంటే ప్రకాశవంతమైన సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రాది గోళముల రూపంలో పరమాత్మ ఉన్నాడు అని చెప్పటం అధిదైవికంగా చెప్పటము.

ఆ సూర్యభగవానుడే మనలో మానవులలో సర్వప్రాణికోటి యొక్క హృదయాకాశములో-దహరాకాశంలో చైతన్య రూపంగా ఉన్నాడు అని భావించటం ఆధ్యాత్మికంగా వివరించటము. మనలోనే అంతరాత్మగా ఉన్న దానిని గ్రహించాలి. హంసః అన్న పదాన్ని నామవాచకంగాను, క్రియా పదంగాను చూడవచ్చును. "హంతి గచ్ఛతి ఇతి హంసః" అని చెప్పారు. గతిశీలుడై ఉంటాడు కనుక సూర్యుని హంస అన్నారు. "హంతి తమః ఇతి హంసః" చీకట్లను పోగొడతాడు కనుక హంస అని చెప్పారు. మానస సరోవరంలో హంస రూపంలో ఉన్నది, అంటే మనలో శ్వాస రూపంలో ఉంటాడు.

2. వసురన్తరిక్ష సద్ - వసుః "వాసయతి సర్వానితి వసుః". సర్వులను వశింపజేసేది, సర్వము నందు వసించేది అయిన వాయువు రూపంలో అంతరిక్షంలో అనగా భువర్లోకంలో ఉన్నాడు. సర్వప్రాణుల మనుగడ వాయువు వలన సంభవిస్తున్నది. పరమాత్మ వాయు రూపంలో అనగా వాయుదేవునిగా ఉన్నాడు అని గ్రహించటం ఆధిదైవిక వివరణ. ఆ వాయువే సర్వప్రాణి కోటిలో ఉచ్ఛ్వాసనిశ్శ్వాసల రూపంలో, పంచ ప్రాణముల రూపంలో ఉంటున్నది అని గ్రహించటం ఆధ్యాత్మికంగా గ్రహించటము. భువికి దివికి మధ్య ఆకాశం ఉన్నది. వాయువు ఉన్నది. అంతరిక్షంలో

వాయు రూపంగా సంచరిస్తున్న మహాశక్తియే పరబ్రహ్మము. అంతరిక్షమే భువర్లోకము. పవమాన సూక్తములో, వాయు సూక్తంలో వాయువును పరబ్రహ్మముగా స్తోత్రించారు. గణపతి అథర్వ శీర్షములోను, "శం నో మిత్రశ్శం వరుణః..." అనే శాంతి మంత్రములోనూ పరబ్రహ్మమును వాయువుగా ప్రస్తుతించారు.

"నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాSసి. త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యమి. ఋతం వదిష్యామి. సత్యం వదిష్యామి. తన్మామవతు. తద్వక్తారమవతు. అవతు మామ్. అవతు వక్తారమ్. ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః."

ఇలా అధిదైవికంగా వాయువుని దేవుడని చెప్పారు. ఆధ్యాత్మికంగా ఆ వాయువే సర్వ మానవులలోని, సర్వప్రాణి కోటి లోని వాయు తత్వంగా చెప్పబడింది. వాయువు లేనిదే ఒక్క నిమిషమైనా ప్రాణికోటి మన జాలదు. కనుక అంతరిక్షంలో వాయువుగా ఉన్న పరమాత్మే మనలో వాయు రూపంలో ఉన్నాడు.

3. 'హోతా వేదిషత్' ఇక్కడ హోతా అంటే అగ్ని అని అర్థం. "అగ్నిర్వై హోతా" అని ఋగ్వేదం చెప్తోంది. సాధారణంగా యజ్ఞం చెయ్యాలంటే బ్రహ్మ, అధ్వర్యుడు, హోతా, ఉద్గాథ అని నలుగురుంటారు. ఇక్కడ ఆ హోతను గురించి ప్రస్తావించటం లేదు. ఈ మంత్రంలో పరమాత్మ వేదిలో అనగా పృథ్విలో హోతగా అనగా అగ్నిగా ప్రకాశిస్తున్నాడు అని చెప్పారు. వేదిక అంటే హోమ కుండము. కానీ ఇక్కడ వేదిక అంటే భూమి అని గ్రహించాలి.

"ఇయం వేదిః పరోంతః పృథివ్యాః" అనే మంత్రం వలన వేదిః అంటే పృథ్వీ అని తెలుస్తోంది. హోతా వేదిషత్, అంటే పరమాత్మ పృథ్వీ దేవత యందు అగ్ని రూపంలో ఉంటున్నాడని చెప్పారు. అగ్నిని దైవంగా భావించడం ఆధిదైవికంగా గ్రహించటము. ఆధ్యాత్మికంగా పరమాత్మ అగ్ని రూపంలో వైశ్వానరాగ్ని రూపంలో, జఠరాగ్ని రూపంలో మనలోనే ఉన్నాడు. పరమాత్మ గీతలో (15-14) ఇలా చెప్పాడు -

"అహం వైశ్వానరో భూత్వా, ప్రాణినాం దేహమాశ్రితః! ప్రాణాపానసమాయుక్తః, పచామ్యన్నం చతుర్విధమ్"!!

'ఉరః వేదీ.' హృదయమే వేదిక. హృదయ వేదిక అనగా పృథ్వీ తత్వము. పృథ్వీ దేవత మన హృదయంలో, మన శరీరంలో ద్రవ్య రూపంలో పదార్థ రూపంలో ఉన్నది.

మనము సప్త వ్యాహృతులను చెప్తున్నాము. కానీ వేదాంతంలో మూడే వ్యాహృతులను చెప్పారు. భూః, భువః, స్వః అనే మూడు లోకాలే చెప్పబడినాయి. ఈ మూడు లోకాలలోను పరమాత్మ, అగ్నిగా, వాయువుగా, ఆదిత్యునిగా ప్రకాశిస్తూ ఉన్నాడు.

4. అతిథిర్దురోణ సత్ - అతిథిః అనగా ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తూ, గృహస్థుల గృహాలకు వచ్చేవారు అని చెప్పారు. అలా అనాహూతులై వచ్చే వారిని "అతిథిర్వై నారాయణః" అంటూ సాక్షాత్తుగా దైవస్వరూపంగా భావించి ఆదరించి సత్కరించటం మన

సనాతన సంప్రదాయము. "అతిథిః కిల పూజార్హః" అని శ్రీమద్రామాయణం చెప్తోంది. "అతిథి దేవో భవ" అని తైత్తిరీయోపనిషత్తు బోధిస్తున్నది. ఈ ప్రస్తుత మంత్రం పరమాత్మ అతిథి రూపంలో ఉన్నాడని చెప్తోంది. మనకు సంఘంలో అనేక సందర్భాలలో ఎవరెవరితో అనుబంధం కలుగుతుందో వారందరూ పరమాత్మ రూపాలే!

5. దురోణ సత్ - దురోణము అంటే ద్రోణము, చెక్కతో చేయబడిన ఒక పాత్ర. యజ్ఞ సమయంలో ఈ ద్రోణంలో సోమరసాన్ని పోసి దానిని అగ్నిహోత్రుని ద్వారా దేవేంద్రునికి, దేవతలకు సమర్పిస్తారు. దీనిని దొన్నె, దొప్ప అని కూడా అంటారు. కొన్ని సందర్భాలలో అరిటాకులతో కూడా ఈ దొప్పలను చేస్తారు. సోమలతతో తయారు చేయబడిన సోమరసము అంటే దేవతలకు ప్రీతి, దేవేంద్రునికి బహు మక్కువ. పాండు రోగంతో బాధపడుతున్న అపాల అనే స్త్రీకి ఒక సోమలత దొరుకుతుంది. ఆమె దానితో సోమరసమును తయారుచేసి, మానసిక యజ్ఞము చేసి సోమరసాన్ని ఇంద్రునికి సమర్పించినందుకు సంతోషించి దేవేంద్రుడు ఆమె జబ్బును పోగొట్టి, ఆమె దేహానికి కాంతిని కలిగించాడని ఋగ్వేదము, స్మృతి గ్రంథములు చెప్తున్నాయి.

మన ప్రస్తుత మంత్రములో ద్రోణము, అందులోని సోమరసము అన్నీ పరబ్రహ్మ స్వరూపములే అని చెప్పబడుతున్నాయి. దురోణ సత్ అంటే అతిథి రూపంగా గృహములలో ఉన్నవాడు అని అర్థం చేసుకోవాలి. ద్రోణములో ఉన్న సోమరసము వలె గృహములలో ఉన్న అతిథి పరమాత్మ స్వరూపము అని గ్రహించాలి.

6. నృషత్ - నృ - నర అంటే మానవులు. సత్ అంటే ఉన్నది. సర్వ మానవ స్వరూపములుగా ఉన్నది పరమాత్మే! మానవులు అంటే సమస్త మానవజాతి అని గ్రహించాలి. యావద్భూమండలములోని ఏ ప్రాంతంలోనైనా, అంటే ఏ దేశంలో ఉన్న వారైనా, ఏ కాలంలోని వారైనా, స్త్రీలైనా, పురుషులైనా, తద్భిన్నులైనా సరే, పెద్దవారైనా, యువకులైనా, వృద్ధులైనా, చిన్న పిల్లలైనా, ఎటువంటి వయో భేదములతో సంబంధం లేకుండా, దుర్మార్గులని, సన్మార్గులని తేడా లేకుండా, పాండిత్య అపాండిత్యాదులతో కానీ ఏ సంబంధం లేకుండా, సర్వ మానవులుగా ఉన్నది పరమాత్మే అని గ్రహించాలి. నరుల యందున్న వారే నారాయణుడు. నారం అంటే జ్ఞానము. జ్ఞానములో ఉన్నది పరమాత్మే! "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" నరులలో నారాయణునిగా ఉన్న పరమాత్మను గ్రహించాలి.

7. వరసత్ - వరులు అంటే శ్రేష్ఠులు. మానవ శ్రేష్ఠులవవచ్చును, పరమాత్మ సృష్టిలో శ్రేష్ఠులు అనగా దివ్య ఋషులు, దేవతలు మొదలగువారు అవవచ్చును. వారందరి రూపాలలో ఉన్నది పరబ్రహ్మమే! దేవతలు అనగానే దానవులు కూడా వస్తారు. అటువంటి వారందరిలా భాసిస్తున్నది, అందరిలో చైతన్య రూపంలో ప్రకాశిస్తున్నది పరమాత్మే! మానవులలోనే దేవతలు, మానవులు, దానవులు

కూడా ఉన్నారు అని బృహదారణ్యకోపనిషత్తు చెప్తున్నది. సకల చరాచరములు దైవ స్వరూపమే అని గ్రహించాలి.

**8. ఋత సత్** - ఋతము అంటే సత్యము. ఋతము రూపంలో ఉన్నది పరమాత్మే!

“ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి” అంటోంది ఉపనిషత్తు. ఋతము అంటే ప్రకృతి నియమము. ప్రకృతి అంతా ఋతమును పాటిస్తూనే ఉన్నది. సూర్యుడు తూర్పున ఉదయించటం, పడమర అస్తమించటం, ప్రకృతిలో ఋతువులు ఒకదాని తరువాత ఒకటిగా వాటి లక్షణాలను చూపిస్తూ రావటం, పగలు తరువాత రాత్రి రావటం, సూర్యుడు వేడిమిని, వెలుగును ఇవ్వటము, చంద్రుడు అమృత కిరణుడు అవటము, నీరు చల్లగా ఉండటము, క్రిందికి ప్రవహించటం, నిప్పు వేడిగా ఉండటము, నదులు, సముద్రములు చెలియలి కట్టను దాటకుండా ప్రవహించటము వంటి అనేక ధర్మాలను ఋతము అంటారు. దీనినే కాస్మిక్ ఆర్డర్ అంటారు. ఋతము అంటే నిత్యము సత్యము అయిన తత్వము. పరమాత్మ ఋతములా వ్యక్తమవుతున్నాడు. పరమాత్మ ఏర్పరచిన విశ్వ రచనా ప్రణాళికను ఋతము అంటారు. దానిని ఆచరణలోకి తేవటమును సత్యము అంటారు. ఋతము అంటే యజ్ఞము అని కూడా చెప్పవచ్చును. ఏ పనినైనా శ్రద్ధగా, అంకితభావంతో, ఏకాగ్రతతో చేయటమే యజ్ఞము.

**9. వ్యోమసత్** - వ్యోమము అంటే ఆకాశము. ఆకాశము అంటే ప్రకాశము, ప్రకాశించేది, వెలుగుతో కూడినది. సర్వవస్తు జాతము ఉండటానికి అవకాశం కలిగించేది ఆకాశము. విశ్వంలోను ఆకాశం ఉంది, మన దేహములోనూ ఆకాశం ఉన్నది. అటువంటి ఆకాశ స్వరూపుడు పరమాత్మే! ఘటాకాశ, పటాకాశ, మఠాకాశములన్నీ బహిరాకాశములే! ఒకే ఆకాశ స్వరూపమే! సకల వ్యోమచరములు పరమాత్మే అని గ్రహించాలి.

**10. అబ్జా** - అప్ జా - అప్ అనగా జలములు. జా అనగా పుట్టుట అని అర్థము. అబ్జా అనగా నీటి నుండి పుట్టినవి. పరమాత్మ జల రూపంలో ఉన్నాడు, నీటి నుంచి పుట్టిన వాటి రూపంలో ఉన్నాడు. నీటి నుంచి పద్మములు, కలువలు, శంఖములు, శుక్తి - ముత్యపు చిప్పలు, ముత్యాలు, రత్నాలు, జల జంతువులు మకరాదులు, తాబేలు, తిమింగలాలు, అనేక రకాల చేపల వంటి జలచరాలు మొదలైనవన్నీ నీటి నుండి పుట్టినవే ! పరమాత్మ వాటి రూపంలో ఉన్నాడు. జగద్గురువులు శ్రీ ఆదిశంకర భగవత్పాదులు తమ భాష్యములో - “శంఖ శుక్తి మకరాది రూపేణ జాయతే ఇతి” అన్నారు. అనగా సకల జలచరములు పరమాత్మే అని వివరించారు.

**11. గోజా** - గో అంటే గౌః - ఆవు. గోవు అంటే కిరణాలు, బ్రాహ్మణులు, నారాయణుడు, భూమి, వేదములు మొదలైన అనేక ఇతర అర్థాలున్నాయి. వీటన్నిటి రూపంలో ఉన్నది ఆత్మే ! వీటి నుంచి పుట్టిన వాటన్నింటి రూపంలో ఉన్నది పరమాత్మే ! గోవు నుంచి అనగా ఆవు నుంచి

పంచగవ్యములను పొందుతాము. ఎద్దులు దుక్కి దున్నితేనే పంట పండుతుంది. సూర్యకిరణాల వల్లే జీవము, ఆరోగ్యము, వెలుగు, జ్ఞానము కలుగుతుంది. అలా గోవు నుంచి వచ్చే అన్నింటిని పరమాత్మగా గ్రహించాలి. ఇక్కడ ఈ మంత్రములో గో శబ్దానికి అర్థము భూమి అనే గ్రహించాలి. భూమి నుంచి ఉత్పన్నమయ్యే వ్రీహ్యావాదులు, కందమూలములు, దుంపలు, చెట్లు, మొక్కలు, వాటి నుంచి లభించే పళ్ళు, పూలు, కాయలు, కూరలు, ధాన్యపు దినుసులు - గోధుమలు, ధాన్యము, పప్పు దినుసులు మొదలగునవి పరమాత్మే! పంట పొలాలు, పుష్పాలు, ఫలములు సర్వము పరమాత్మే! భూమి నుంచి లభించే ఖనిజములన్నీ పరమాత్మ స్వరూపమే! చిన్ని కీటకము మొదలు మానవుల వరకు, దేవతల వరకు, పంచభూతాత్మక శక్తుల వరకు, దిగ్దేవతల వరకు, అందరూ, అన్నీ పరమాత్మ స్వరూపములే! పృథివ్యప్ తేజో వాయు రాకాశములైన పంచభూతాలు పరమాత్మే అని చెప్పారు. గోజా అన్న ఈ మంత్రములో భూమి, భూజములన్నీ పరమాత్మే అని చెప్పబడింది.

12. ఋతజ - ఋతము అంటే యజ్ఞము. ఋతజ అంటే యజ్ఞము నుంచి పుట్టేది. "యజ్ఞాంగ రూపేణ జాయతే ఇతి" అని చెప్పారు. యజ్ఞమే సాక్షాత్తుగా పరమాత్మ స్వరూపము. యజ్ఞము, యజ్ఞాంగములు, యజ్ఞమును నిర్వహించే బ్రహ్మ, హోత, అధ్వర్యుడు, ఉద్గాథ, సమిథలు, ఆజ్యము, పురోడాశములు, లాజలు, నవధాన్యాలు మొదలగు ఆహుతులన్నీ పరమాత్మయే ! యజ్ఞ ఫలము పరమాత్మయే ! ఇన్ని రూపములలోనూ ఉన్నది ఆత్మే !

13. అద్రిజా - అద్రి అంటే పర్వతము. జా అంటే పుట్టడము. అద్రిజా అంటే పర్వతముల నుండి ఉద్భవించేవి. పర్వతాలపై పెరిగే వృక్షాలు, పర్వత గుహలలో నివసించే జంతువులు. పర్వతముల పైన తిరిగే జంతువులు. వృక్షముల నుండి జాలువారే జలపాతములు, పర్వత శ్రేణులందు పుట్టి ప్రవహించే జలపాతము, నదులు మొదలగు వాటన్నింటి రూపంలో ఉన్నది పరమాత్మే ! అద్రిజ అంటే ఆదిపరాశక్తి అని కూడా అర్థం ఉంది. వీటన్నింటి రూపంలో ఉన్నది ఆత్మే !

14. ఋతమ్ - పరమాత్మ ఋత స్వరూపుడై ఉన్నాడు. ఋతము అంటే సర్వాత్మ స్వరూపము. అన్నింటికి సారమై, స్వరూపమై ఉన్నది.

"సర్వాత్మాऽపి సన్ ఋతం అవితథ స్వభావః ఏవ" - అని శ్రీ ఆదిశంకర భగవత్పాదులు తమ భాష్యములో చెప్పారు. తథా - అంటే ఆ విధముగా - అనగా, ఉన్నది ఉన్నట్లుగా ఉండటము. యథా తథా - ఎలా ఉండేలా అలాగే, ఎక్కడున్నది అక్కడే ఉండటము.

"వితథా" అంటే ఉన్నది ఉన్నట్లుగా లేకుండా, మారిపోతూ ఉండటము, మార్పు చెందుతూ ఉండటము. అంటే "వితథా" అంటే మార్పు చెందినది. "అవితథా" అంటే మార్పు చెందనిది. మార్పు చెందనిది ఎప్పుడూ పరమాత్మ మాత్రమే! ఆయనే అవ్యయుడు. దీనినే ఋతము అంటాము.

**15.** బృహత్ - చాలా పెద్దది. అత్యంత మహిమోపేతమైనది. బృహత్ అనగా గొప్పది మహాన్ ఐనది. సర్వాన్ని అతిశయించి ఉన్నది. ఇదే సర్వకారణ కారణము. "అణోరణీయాన్, మహతో మహీయాన్"అని చెప్పబడిన పరబ్రహ్మ తత్త్వము మహత్తు. అదే బృహత్. అదే బ్రహ్మము. ఈ మంత్రములో సర్వము పరమాత్మే అని చెప్పారు. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అన్నది ఇక్కడ చెప్పబడినది. ఆత్మ యందు భేదము లేదు అన్నది చెప్పటమే ఈ మంత్ర సారము. "నేహ నానాస్తి కించిన", "సర్వం హ్యేతద్బ్రహ్మ"," ఈసావాస్యమిదం సర్వం" అన్న ఉపనిషద్ వాక్యముల సారము ఈ మంత్రములో నిరూపించబడినది. జీవులకు, జీవులు, జీవునికి దేవునికి, జీవునికి జగత్తునకు, జీవాత్మకు, పరమాత్మకు అభేదం చెప్పబడింది. గీతలో (**6-30**) పరమాత్మ ఇలా చెప్పాడు -

"యో మాం పశ్యతి సర్వత్ర, సర్వం చ మయి పశ్యతి!
తస్యాహం న ప్రణశ్యామి, స చ మే న ప్రణశ్యతి"!!

నన్నే సర్వములోనూ దర్శిస్తూ, సర్వమును నాయందే దర్శించే సమదర్శి ఎప్పుడూ నశించడు అని పరమాత్మ చెప్పాడు. అన్నింటిలో అంతట ఉన్నది ఆత్మే ! మనలో ఉన్నది, అందరిలో ఉన్నది ఆ ఆత్మే అని అందరు గ్రహించినప్పుడు ఎవరూ ఎవరినీ హింసించరు, ఎవరూ అనైతిక పనులకు తావివ్వరు, ఎవరూ ఎవరిని ద్వేషించరు. ఎవరు భూమిని, నదులను అనగా జలములను, వాయువును కలుషితం చేయరు, పాడు చేయరు. అందరూ అందరికీ పరస్పరము సహకరించుకుంటూ, గౌరవించుకుంటూ ఆనందంగా ఉంటూ అందరినీ ఆనందింప చేస్తారు. అది మన ఉపనిషత్ మంత్రముల బోధ. "నేహ నానాస్తి కించిన" సారమే ఈ మంత్రము యొక్క సారము అని గ్రహించాలి. ఇదే జీవబ్రహ్మైకత్వ భావన. దీని వలన "అహం బ్రహ్మాऽస్మి" జ్ఞానము కలుగుతుంది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని గ్రహిస్తారు.

## రచయిత్రి గురించి



**డాక్టర్ సోమంచి (తంగిరాల) విశాలాక్షి**, ఎమ్.ఏ. (తత్వశాస్త్రం), ఎమ్.ఏ. (సంస్కృతం), ఎమ్.ఫిల్., పి.హెచ్.డి., - వీరు హైదరాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతం ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేసియున్నారు. వీరు సంస్కృత భారతి నిర్వహించే వివిధ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మరియు సంస్కృతం ఎమ్.ఏ. చదివే విద్యార్థులకు పాఠములను బోధించే అనుభవయుక్త అధ్యాపకులు. వీరు సంస్కృత భారతిలో శిక్షికా మరియు కార్యకర్త. శ్రీమతి విశాలాక్షి గారు ఆధ్యాత్మికవేత్త మరియు సనాతన ధర్మముపై ఉపన్యాసాలు ఇస్తుంటారు. వీరు వన్ వరల్డ్ యూనివర్సిటీ ట్రస్ట్ అనే సంస్థలో చీఫ్ మేనేజింగ్ ట్రస్టీగా పనిచేశారు. రక్షా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు వీరికి విశిష్ట మాతృమూర్తి బిరుదునిచ్చి సత్కరించారు. వీరు వేద సంస్కృతి సమితి (VSS)లో వైస్ ప్రెసిడెంట్ మరియు సీనియర్ ఫ్యాకల్టీ, సనాతన ధర్మంలో సర్టిఫికేట్ కోర్సులో అసోసియేట్ డైరెక్టర్. వీరు వేద సంస్కృతి సమితి నిర్వహిస్తున్న సనాతన ధర్మము సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు పాఠములను బోధిస్తున్నారు.

# Veda Samskruti Samiti

13-1-62 & 13-1-47/1
Veenapani Nagar, Malkajgiri
HYDERABAD Telangana



Veda Samskruti is an inherent intellectual property of Bhaarata dEsham. It is the basic duty and right of every citizen in Bhaarata dEsham to protect this Intellectual property. Indian Constitution and Law provides provision for protection and preservation of its culture, its monuments, architecture etc.

The Chaturvedas said to have 1131 shaakhaas right up to the time of Aadi Shankaraachaarya and thereafter during last more than ten centuries, many shaakhaas are out of practice due to various reasons and presently only seven shaakaas are in the practice of Guru shiShya parampara.

There is a need to continuously preserve these available shaakhaas which may likely to disappear in future due to various external forces acting in the country vigorously with the power of money and global politics. It is time for the intellectuals of Bharata dEsham to wake-up and work collectively to protect and preserve Veda Samskruti of Bharata dEsham, by empowering the Youth of Bharat dEsham, the future care takers of this great Indian Heritage , with suitable education of our correct history and culture.

The above background lead to formation of this Veda Samskruti Samiti which is registered under Societies acts of Government of Telangana, with Regd. No. 961/2016 by Sri A.H. Prabhakara Rao, who is the Founder and President of the Samiti.

The **vEda vaaNee** e-journal, ISSN 2583-9020, is now publishing its **Volume 2, Issue 2, July 2024.**